క్లుప్తంగా

ఘనంగా సీతారాముల కల్యాణం



మంగళసూత్రం చూపుతున్న వేద పండితులు

చిల్లకూరు: మండలంలోని గుమ్మళ్లదిబ్బ కొత్తూరులో విశ్వ హిందూ పరిషత్, దేవాదాయశాఖ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. కల్యాణానికి సుమారు 500 మందికి పైగా భక్తులు హాజరయ్యారు. అనంతరం స్వామివారి అక్షింతల కోసం యువతీ యువకులు పోటీ పడ్డారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార కాపులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు అండగా ఉంటా



దుస్తులు అందజేస్తున్న ఈఈ గిరినాథ్

గూడూరురూరల్: తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ పిల్లలకు తన వంతు సహకారం అందించి, అండగా ఉంటానని పంచాయతీ రాజ్ ఈఈ గిరినాథ్ అన్నారు. గూడూరులోని బాలసదన్‌లో సోమవారం పిల్లలకు దుస్తులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ చాలా రోజులుగా బాలసదన్‌లోని పిల్లలకు తమ వంతు సహకారం అందించాలని అనుకుంటుండగా తన కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో పిల్లలకు నేడు దుస్తులు అందించామన్నారు.

పాఠశాల తనిఖీ



విద్యాసామర్థ్యాలు పరీక్షిస్తున్న ఎంఈఓ

దొరవారిసత్రం: నేతాజీనగర్ ప్రాథమిక పాఠశాలను సోమవారం ఎంఈఓ కృష్ణయ్య తనిఖీ చేశారు. పాఠశాలల్లో పలు రికార్డులు పరిశీలించారు. జగనన్న గోరుముద్ద పథకాన్ని తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పరీక్షించారు.

నవరత్నాలు.. పేదలకు వరాలు



అర్జీలు స్వీకరిస్తున్న కౌన్సిలర్ శంకరయ్య

వెంకటగిరిరూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల సంక్షేమ పథకాలు పేదలకు వరం లాంటివని 14వ వార్డు కౌన్సిలర్ శంకరయ్య పేర్కొన్నారు. సుదర్శనం నగర్‌లోని సచివాలయంలో సోమవారం స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల వద్ద నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.

హక్కుపత్రాల పంపిణీ



హక్కుపత్రాలను అందజేస్తున్న అధికారులు

చిల్లకూరు: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం కింద సోమవారం మండలంలోని ముత్యాలపాడు, ఓడూరు, నెలబల్లిరెట్టపల్లె, చేడిమాల సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రకియ చేపట్టారు. చేడిమాల సచివాలయంలో మహిళలకు హక్కుపత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో వీఆర్వోలు విద్యావతి, ఐ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి రమణయ్య పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



ఎన్‌బీకేఆర్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో ఈ నెల 23వ తేదీన ట్రిపుల్‌ఈ విభాగం ఆధ్వర్యంలో ఇన్స్పిరిన్ సదస్సు జరుగుతుందని కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం కళాశాలలో సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సదస్సుకు పలు రాష్ట్రాల ఇంజినీరింగ్ విద్యార్థులు హాజరై తమ ప్రాజెక్టులను ప్రజెంట్ చేస్తారని ఆయన తెలిపారు. అధ్యాపకు లు ప్రభాకర్‌రెడ్డి, రమేష్, పార్థసారథి పాల్గొన్నారు.

కండలేరులో 11.663 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 11.663 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 260 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, హైలెవల్ కాలువకు 60, లోలెవల్ కాలువకు 360 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మహిళల సంక్షేమమే సీఎం లక్ష్యం



సూళ్లూరుపేటలో ఆసరా చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న నేతలు

సూళ్లూరుపేటరూరల్: మహిళల సంక్షేమమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. సూళ్లూరుపేట ఎంకేఎం కళ్యాణ మండపంలో ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చి హామీలను 95 శాతం నేరవేర్చారని తెలిపారు. పొదుపు సంఘం మహిళలకు రూరల్‌లో రూ.3.30 కోట్లు, అర్బన్‌లో రూ.3.59 కోట్లు ఆసరా నిధులు అందజేశారని తెలిపారు. చంద్రబాబు నాయుడు అనేక హామీలిచ్చినా చేసిందేమి లేదని విమర్శించారు. అనంతరం ముఖ్యమంత్రి చిత్ర పటానికి మహిళలు పాలాభిషేకం చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజల సమస్యల పరిష్కార లక్ష్యంగా సీఎం జనగ్మోహన్ రెడ్డి పని చేస్తున్నారని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. సూళ్లూరుపేట మున్సిపాలిటీ మన్నారుపోలూరులోని టిడ్కో గృహాలకు రూ.12.75 కోట్లతో తాగునీటి సరఫరా చేసే ప్లాంట్ నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అనంతరం ప్లాంట్ నిర్మాణాలు, కాళంగి నది వద్ద ఉన్న పైపులైన్లు పరిశీలిచారు. ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. సూళ్లూరుపేటలో 1,632 టిడ్కో ఇళ్లను రూ.118 కోట్లతో నిర్మించారని తెలిపారు. ఈ నెల 16వ తేదీన వాటిని లబ్ధిదారులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ అనీల్‌కుమార్‌రెడ్డి, ఎన్‌డీసీసీబీ చైర్మన్ కే సత్యనారాయణరెడ్డి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ టీ ప్రసాద్, పీ ప్రభాకర్‌రెడ్డి, జే వేణు, మున్సిపల్ వైస్ చైర్మన్ సీ సత్యనారాయణ, సర్పంచ్ టీ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీల బలోపేతానికి చర్యలు

తడ: నియోజక వర్గంలోని సూళ్లూరుపేట, నాయుడుపేటలోని వ్యవసాయ మార్కెటింగ్ శాఖల బలోపేతానికి చర్యలు తీసుకున్నట్టు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. మండలంలోని పులివేంద్ర గ్రామంలో ఉన్న ఏఎంసీ కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పీ కవిత అధ్యక్షతన సోమవారం నిర్వహించిన తొలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కమిటీ ఆదాయ, వ్యయాల గురించి ఏఎంసీ సెక్రటరీ రామమ్మ సభ్యులకు వివరించారు. అనంతరం ఏఎంసీలో చేట్టాల్సిన అభివృద్ధి పనులు తదితర అంశాలపై సమీక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దొరవారిసత్రంలతో 3.5 ఎకరాల్లో గోదాము, కళ్లాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏఎంసీ ఉపాధ్యక్షుడు నాగరాజారెడ్డి, ఎంపీపీలు కే రఘురెడ్డి, ఏ అనిల్‌కుమార్‌రెడ్డి, కొండూరు సర్పంచ్ వెంకటలక్ష్మి, నాయకులు మునీష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సీ సత్యనారాయణ పాల్గొన్నారు.

కలిసికట్టుగా పనిచేద్దాం



నాయకులతో మాట్లాడుతున్న రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా కలసికట్టుగా పార్టీ విజయం కోసం పని చేద్దామని, మోసపూరితంగా వ్యవహరిస్తున్న ప్రత్యర్థులను తరిమికొట్టాలని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఆయన వాకాడులోని తన నివాసంలో గూడూరు నియోజకవర్గంలోని వాకాడు, చిల్లకూరు, కోట, చిట్టమూరు మండలాల పార్టీ శ్రేణులతో విడి విడిగా సమీక్ష సమావేశం నిర్వహించారు. రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును క్షేత్ర స్థాయిలోకి తీసుకెళ్లి, గత ఎన్నికల్లో వచ్చిన మెజారిటీ కన్నా రెట్టింపు ఫలితాలు వచ్చేలా అందరు సమష్టిగా పనిచేయాలన్నారు. అనంతరం పలువురు నాయకులు సాగునీటి సమస్యపై రామ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఆయన సంబంధిత ఉన్నత అధికారులతో మాట్లాడారు. మరో మూడు రోజుల్లో తెలుగు గంగ జలాల విడుదలకు అధికారులు సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, నేతలు దామోదర్‌రెడ్డి, కుమార్ స్వామిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మనోజ్‌కుమార్‌రెడ్డి, అజిత్‌కుమార్‌రెడ్డి, నాగూర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, జానకి రామిరెడ్డి, శేషురెడ్డి, శ్రీనివాసులురెడ్డి, కస్తూర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కోటిరెడ్డి, పెంచలరెడ్డి, మధురెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కష్టపడి పనిచేయాలి



సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలసిన ఎమ్మెల్సీ కళ్యాణచక్రవర్తి

చిల్లకూరు: ఉమ్మడి నెల్లూరు జిల్లాలో వైఎస్సార్‌సీపీ విజయానికి కష్టపడి పని చేయాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తనకు సూచించారని ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ చక్రవర్తి తెలిపారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో సోమవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆయన చాంబర్ వద్ద బల్లికళ్యాణ్ కలిశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ సందర్భంగా ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పార్టీ స్థితిగతులపై ఆరా తీశారన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారని తెలిపారు.

ముమ్మరంగా వరి కోతలు



కుప్పారెడ్డిపాళెంలో వరి కోస్తున్న యంత్రం

దొరవారిసత్రం: మండలంలో వారం రోజుల నుంచి వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే పూలతోట, కొత్తపల్లె, వేణుంబాకం, వెదురుపట్టు, ఏకొల్లు, కుప్పారెడ్డిపాళెం, నేలపట్టు, మైలాంగం తదితర గ్రామాల్లో వరి కోతలు జోరుగా జరుగుతున్నాయి. కోత మిషన్లకు మంచి డిమాండ్ రావడంతో రైతులు మిషన్లను రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా బయట రాష్ట్రాల నుంచి కూడా యంత్రాలను రప్పించి, కోతలు కోయిస్తున్నారు. పలు ప్రాంతాల్లో ఎలిది పంట ఎకరాకు 20 నుంచి 25 బస్తాలు, నాట్లు వేసిన వరి అయితే ఎకరాకు 30 నుంచి 35 బస్తాలు దిగుబడులు వస్తున్నాయని రైతులు తెలిపారు. వెదురుపట్టు, ఏకొల్లు, వేణుంబాకం తదితర గ్రామాల్లో ఎలిది వరి కోత కోయగా 25 బస్తాలు పైబడే దిగుబడి వచ్చినట్లు తెలిపారు. అలాగే కొత్తపల్లె, పూలతోట, కట్టువాపల్లె, సింగనాలత్తూరు, శ్రీధనమల్లి, తొగరాముడి తదితర ప్రాంతాల్లో వరి నాట్లు వేసి పంట పొలాల్లో 35 బస్తాల వరకు దిగుబడి వచ్చినట్లు రైతులు పేర్కొన్నారు. ఈ సీజన్‌లో వ్యవసాయధికారుల లెక్కల ప్రకారం 4,300 హెక్టార్లు వరి పంట సాగు చేయగా ఇందులో వెయ్యి హెక్టార్ల పైబడి ఎలిది పంట సాగు కాగా, మిగిలిన విస్తీర్ణంలో నాట్లు వేశారు. ఆర్ఎన్ఆర్, బీపీటీ, కేఎన్ఎం వరి రకాలు అధికంగా రైతులు సాగు చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

జగనన్నకు అండగా నిలవాలి



మాట్లాడుతున్న మేరిగ మురళీధర్

కోట: సంక్షేమ ప్రదాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలిచి, మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని ఎమ్మెల్సీ, గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్ సూచించారు. సోమవారం మండలంలోని వంజివాకలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని పార్టీ నాయకులతో కలసి మేరిగ మురళీధర్ ప్రారంభించారు. ముందుగా కోట నుంచి వంజివాక వరకు మోటారు సైకిల్ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీతో పాటు పార్టీ రాష్ట్ర కార్యదర్శి పీ శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎన్ వినోద్‌కుమార్‌రెడ్డి, సీ దశరథరామిరెడ్డికి స్థానికులు ఘనస్వాగతం పలికారు. అనంతరం వంజివాకలో వైఎస్సార్ విగ్రహానికి, సచివాలయం వద్ద ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తరువాత నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మేరిగ మురళీధర్ మాట్లాడుతూ రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారన్నారు. మరోసారి ఆయన్ని ముఖ్యమంత్రిని చేసుకుంటే మరింత గొప్పపాలన అందిస్తారన్నారు. ఎంతమంది చంద్రబాబునాయుడులు, పవన్ కల్యాణ్‌లు వచ్చినా ప్రజల ఆశీర్వాదం ఉన్న జగన్‌మోహన్‌రెడ్డిని ఏమీ చేయలేరన్నారు. పార్టీకి సైనికుడిలా పనిచేసి ఇప్పటి వరకు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన బాధ్యతను నెరవేర్చానని, అందరి సమష్టి కృషితో గూడూరు నియోజకవర్గంలో పార్టీని మరింత ముందుకు తీసుకుపోతానన్నారు. సచివాలయానికి స్థలదాత చిల్లకూరు దశరథరామిరెడ్డిని మేరిగ మురళీధర్ అభినందించారు. పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికి మంచి జరిగిందన్నారు. వైఎస్సార్ సీపీ కోట, చిట్టమూరు మండలాల కన్వీనర్లు సంపత్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఎంపీపీ అంజమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు కోటయ్య, ఎంపీటీసీ సభ్యులు శశికళ, మొబీన్‌బాషా, వంజివాక, పుచ్చలపల్లి, అల్లంపాడు సర్పంచ్‌లు అంకమ్మ, గోవర్ధన్‌రెడ్డి, ఈశ్వరరెడ్డి, నాయకులు రమణారెడ్డి, భక్తవత్సల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

పెళ్లకూరు: మండలంలోని నెలబల్లిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సురేష్‌బాబు తెలిపారు. నెలబల్లి గ్రామ సచివాలయ పరిధిలోని అన్ని ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నాయుడుపేట డీఎస్పీగా శ్రీనివాసరెడ్డి



ఎమ్మెల్యే సంజీవయ్యను కలిసిన డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

నాయుడుపేటటౌన్: స్థానిక డీఎస్పీగా వీ శ్రీనివాసరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన చిత్తూరు స్పెషల్ బ్రాంచి డీఎస్పీగా పని చేస్తూ బదిలీపై నాయుడుపేటకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి చిత్తూరుకు బదిలీ అయిన విషయం తెలిసిందే. కొత్త డీఎస్పీకి నాయుడుపేట అర్బన్, రూరల్ సీఐలు శ్రీనివాసరెడ్డి, జగన్‌మోహన్‌లు పుష్పగుచ్ఛాలు అందజేశారు.

ఎమ్మెల్యే కిలివేటితో డీఎస్పీ భేటీ

నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. నాయుడుపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డీఎస్పీ ఎమ్మెల్యేని కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు.

నేడు న్యూరాలజిస్ట్ బిందుమీనన్ రాక

రాపూరు: మండలంలోని వేపినాపి ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి మంగళవారం న్యూరాలజిస్ట్ బిందు మీనన్ విచ్చేయనున్నట్లు ఆరోగ్యకేంద్రం వైద్యులు తెలిపారు. ఆమె మధ్యాహ్నం 3 గంటలకు వైద్యశాల్లో వైద్యసిబ్బంది, ప్రజలకు నరాల బలహీనతపై అవగాహన సదస్సు నిర్వహిస్తారని తెలిపారు. నరాలకు సంబంధించిన వ్యాధులున్న రోగులు వచ్చి సలహాలు తీసుకోవాలని కోరారు.

డీఆర్‌డబ్ల్యూ కళాశాల అధ్యక్షుడిగా శివకుమార్‌రెడ్డి

గూడూరురూరల్: పట్టణంలోని దువ్వూరు రమణమ్మ (డీఆర్‌డబ్ల్యూ) మహిళా కళాశాల మేనేజ్‌మెంట్ కమిటీ నూతన అధ్యక్షుడిగా శివకుమార్‌రెడ్డి ఎన్నికయ్యారు. కళాశాల మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు అల్లారెడ్డి రవికుమార్‌రెడ్డి ఇటీవల మృతి చెందారు. ఈ క్రమంలో సోమవారం కళాశాల ప్రాంగణంలో కళాశాల మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధ్యక్షుడిగా ఎం శివకుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ సీ జనార్దనరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో వారికి పలువురు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ డాక్టర్ మెహర్మణి, కోశాధికారి విద్యాసాగర్, కమిటీ సభ్యులు, ప్రిన్సిపాళ్లు,అధ్యాపకులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుమన్‌రెడ్డి

ఓజిలి: మండలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుమన్ రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సోమవారం జల సంఘాల ద్వారా తాగునీటి పైప్‌లైన్ల మరమ్మతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలజీవన్‌మిషన్ పథకంలో పంచాయతీల్లో 11మంది సభ్యులతో గ్రామ జల సంఘాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ జలసంఘాల ఆధ్వర్యంలో స్థానికంగా కొళాయి కనెక్షన్లు, పైపులైన్లు, మరమ్మతులు, నూతన పైపులైన్లు ఏర్పాటు తదితర పనులు చేస్తామన్నారు. మండలంలో 50 పనులు మంజూరైనట్లు చెప్పారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ మోహన్ ఉన్నారు.

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం



అర్జీ పరిశీలిస్తున్న ఆర్డీఓ కిరణ్‌కుమార్

గూడూరురూరల్: స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీలకు సత్వర పరిష్కారం లభిస్తుందని ఆర్డీఓ కిరణ్‌కుమార్ తెలిపారు. గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి డివిజన్‌లోని పలు మండలాలకు చెందిన అర్జీదారులు వినతులు అందజేసి, తమ సమస్యల ను విన్నవించారు. ఈ సందర్భంగా గూడూరు పట్టణానికి చెందిన డీ రాధ అనే వితంతువు తన భర్త మృతి చెంది రెండేళ్లు అవుతుందని, దరఖాస్తు చేసినా ఇప్పటివరకు తనకు పింఛన్ రాలేదని అర్జీ అందజేసింది. దీనిపై స్పందించిన ఆర్డీఓ కిరణ్‌కుమార్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లును పిలిపించి పింఛన్ దరఖాస్తును ప్రభుత్వానికి పంపే ఏర్పాటు చేయాలన్నారు. అలాగే చిల్లకూరు మండలం పున్నపువారిపాళెం గ్రామానికి చెందిన హిమబిందు అనే మహిళ తన భర్త చిత్రహింసలకు గురి చేస్తున్నారని, తనపై ఉన్న ఆస్తి హక్కులను రాసి ఇవ్వాలని వేధిస్తున్నట్లు ఫిర్యాదు చేసింది. దీంతో రెవెన్యూ, పోలీ స్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు.కార్యాలయ ఏఓ మునిలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

నాయుడుపేటటౌన్: పట్టణానికి చెందిన టైలర్ పఠాన్ అల్లాబాషా కుటుంబానికి టైలర్ అసోసియేషన్ నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. అలాబాషా (95) ఐదేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి ఆదివారం రాత్రి మృతి చెందారు. సోమవారం జరిగిన అల్లా బాషా అంత్య క్రియల్లో స్థానిక టైలర్లు పాల్గొని, ఆయన మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో కీంగ్స్‌వే జీలాని, శేషయ్య, రఫీ, సీతారామ్, దాము, గోపి, షఫీ తదితరులు ఉన్నారు.

క్షతగాత్రులను ఆస్పత్రిలో చేర్చితే ప్రోత్సాహకం



రోడ్డు ప్రమాద మాసోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రవాణాశాఖాధికారులు

గూడూరురూరల్: రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులను సకాలంలో ఆస్పత్రిలో చేర్పితే వారికి కేంద్ర ప్రభుత్వం నగదు ప్రోత్సాహకం అందిస్తుందని గూడూరు ప్రాంతీయ రవాణాశాఖాధికారి ఆదినారాయణ తెలిపారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని ఎవరైనా గుర్తిస్తే వెంటనే వారికి సకాలంలో ఆస్పత్రికి తరలిస్తే కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకం ద్వారా రూ.5 వేల వరకు నగదు ప్రోత్సాహకం అందించే వీలుందన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారణకు నియమాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ సునీల్, పట్టణ సీఐ పాపారావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా తదితరులు పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

నాయుడుపేటటౌన్: ఏపీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వైఎస్సార్ కడప జిల్లా కేంద్రంలో జరగనున్న మాదిగ ఉప కులాల మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గూటూరు హాజరత్ పిలుపు నిచ్చారు. మహాసభకు సంబంధించిన కరపత్రాలను సోమవారం పట్టణంలోని పాత బస్టాండ్ ఎమ్మార్పీఎస్ నాయకులు ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణ విషయమై కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న నిర్లక్ష్య వైఖరిపై చేపట్టాల్సిన అంశాలపై ఈనెల 8 తేదీ నాడు కడపలో జరిగే మహాసభలో రాష్ట్ర నాయకులు సమీక్షించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభను విజయవంతం చేసేందుకు మాదిగ ఉప కులాలకు చెందిన వారందరు హాజరు కావాలని కోరారు.

మీడియా ముసుగులో టీడీపీకి కొమ్ముకాస్తూ..

పెళ్లకూరు: సమాజంలో జరుగుతున్న అన్యాయాన్ని ఎదుర్కోవాల్సిన ఓ మీడియా విలేకరి టీడీపీకి కొమ్ముకాస్తూ రూ.కోట్లు సంపాదించారని సోమవారం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ కే సత్యనారాయణరెడ్డి ఆరోపించారు. నియోజకవర్గంలో ఓ మీడియాలో పని చేస్తున్న విలేకరి రూ.కోట్లు సంపాదించి, రాజకీయ నాయకులను శాసిస్తున్నట్లు పేర్కొ న్నారు. ఇప్పటికే రూ.కోట్లు విలువ చేసే వ్యవసాయ భూములు, భవంతులు, కార్లు తదితర సుమారు రూ.17 కోట్ల విలువ చేసే ఆస్తులు కూడబెట్టినట్లు ఆరోపించారు. గతంలో నెల్లూరు కలెక్టర్ అక్రిడేషన్ కూడా రద్దు చేసినట్లు పేర్కొన్నారు. విలేకరి తీరుపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రిజిస్ట్రేషన్లు త్వరితగతిన పూర్తి చేయండి



తూమ్మూరు సచివాలయంలో ఉద్యోగులతో మాట్లాడుతున్న కమిషనర్ జనార్దన్‌రెడ్డి

నాయుడుపేటటౌన్: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకంలో మంజూరైన జగనన్న ఇంటి నివేశ స్థలాలకు సంబంధించి జరుగుతున్న రిజిస్ట్రేషన్ల ప్రక్రియ త్వరతగతిన పూర్తి చేయాలని కమిషనర్ జనార్దన్‌రెడ్డి సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని బేరిపేట, ఆర్ముగం నగర్, తుమ్మూరు, భరత్‌నగర్, ఎంఆర్ నగర్ సచివాలయలను సోమవారం ఆయన సందర్శించారు. ఆయా సచివాలయాల పరిధిలోని జగనన్న లేవుట్లలోని ఇళ్ల రిజిస్ట్రేషన్లు ఎంతమేరకు చేశారన్న విషయంపై ఆరా తీశారు. మున్సిపాలిటీలో ఐదు జగనన్న లేవుట్లలో మొత్తం 1,584 మంది లబ్ధిదారుల ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్లు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 358 పూర్తి అయినట్లు గుర్తించారు. కమిషనర్ వెంట మున్సిపల్ మేనుజర్ ఎంకే ఖాజామొహిద్దీన్ తదితరులు ఉన్నారు.